# సమాచారహక్కు చట్టాన్ని అమలు చేసుకుందాం, మెరుగుపరచుకుందాం

చిన్న సమాచారం కోసం ప్రభుత్వ కార్యాలయాల దగ్గర పడిగాపులు కాసిన అనుభవం మనకందరికీ ఉంది.

మా వూళ్లో నీళ్ల టాంకు కోసం నిధులు కేటాయించబోతున్నట్టు ప్రభుత్వ అధికార్లు మా సర్పంచ్‌కు నిరుడు చెప్పారు. ఎప్పుడు కేటాయించబోతారు? ఎంత ఇయ్యబోతారు? కొంచెం చెప్తారా?

ఇళ్ల స్థలాలు లేని ముప్ఫై కుటుంబాల వారము ఏ పేచీ లేని ప్రభుత్వ భూమిని అందుకోసం కేటాయించమని ఎంఆర్‌వో గారికి అర్జీ పెట్టుకొని రెండేళ్లయింది. ఆయన చూస్తామన్నారు. అసలు ఊరిలో ఇళ్ల స్థలాల కేటాయింపుకు తగిన ప్రభుత్వ భూమి ఎంత ఉంది? ఎక్కడ ఉంది? దానిపైన కోర్టు కేసులేవయినా ఉన్నాయా? ఉంటే ఏ దశలో ఉన్నాయి? కొంచెం చెప్తారా?

మా ఊరి పక్కన ఒక పెద్ద ఫ్యాక్టరీ నెలకొల్పడానికి ఫలానా కంపెనీకి అనుమతి ఇచ్చారంట. వారికి భూమి ఎక్కడ కేటాయిస్తారు? వారు ప్రైవేటు భూమి కొనుక్కుంటారా, లేక వారికి ప్రభుత్వ భూమి కేటాయిస్తారా? ఫ్యాక్టరీకి అవసరమైన నీళ్లు ఎక్కడి నుండి ఇస్తారు? మా ఊరి నీటి వనరుల నుండే ఇస్తారా? రోజుకు ఎంత ఇస్తారు? ఆ ఫ్యాక్టరీ వల్ల కాలుష్యం ఏ రూపంలో ఉంటుంది? ఎంత ఉంటుంది? దానికి నివారణ మార్గాలేవయినా ఉన్నాయా? కొంచెం చెప్తారా?

మా ఊరిలో పది మంది స్త్రీలు వితంతు పింఛన్ల కోసం అర్జీ పెట్టుకున్నారు. పక్క ఊరిలో ఎనిమిది మంది పెట్టుకుంటే ఇద్దరికి ఇచ్చారు. మా ఊరిలో ఎవరికీ ఇయ్యలేదు. ఎందుకు? వితంతు పింఛన్లు వితంతువులందరికీ ఇవ్వరా? కొందరికే ఇస్తారా? ఎవరు ఎంపిక చేస్తారు? ఏవిధంగా చేస్తారు? మా వూరి అర్జీదారులకు ఎప్పుడిస్తారు? కొంచెం చెప్తారా?

ఇటువంటి ప్రశ్నలకూ సందేహాలకూ జవాబు దొరకక అధికార్లను అడిగీ అడిగీ వారి చుట్టూ తిరిగీ తిరిగీ విసిగిపోయి ఉన్నాము. ఈ బాధ మనకు పోగొట్టే లక్ష్యంతో పార్లమెంటు 2005 సంవత్సరంలో సమాచార హక్కు చట్టాన్ని చేసింది. దానిలో ఏముందో తెలుసుకొని సద్వినియోగపరచుకుంటే ఈ బాధలు పూర్తిగా కాకున్నా కొంతమేరకయినా ఇక మీద తప్పించుకోవచ్చు.

మనం తెలుసుకొని అమలు చేయించుకోకపోతే ఈ చట్టం అమలు కావడం కల్ల. ప్రజాతంత్రశక్తుల ఒత్తిడి మేరకు ఈ చట్టం చేశారే తప్ప, ప్రజలతో సమాచారం పంచుకోవాలన్న మానసిక పరివర్తన చెందడం వల్ల చేయలేదు. మనం ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ ఈ చట్టాన్ని అమలు చేయించుకోవడానికి ఒత్తిడి పెట్టకపోతే వాళ్లంతటవాళ్లు అమలు చేయరు. మన రాష్ట్ర రెవెన్యూ సిబ్బంది సంఘం పార్లమెంటును ధిక్కరించి, 'ఈ చట్టాన్ని అమలు చేయడం సాధ్యపడదు' అని ఇప్పటికే ప్రకటించి ఉంది.

ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ కార్పొరేషన్లు, స్థానిక సంస్థల నుండి సమాచారం పొందే హక్కు పౌరులందరికీ ఉంది అని ఈ చట్టం సెక్షన్ 3లో అంటుంది.

సమాచారం పొందే హక్కు అంటే సంబంధిత రికార్డులను పరిశీలించే హక్కు, ఫొటోస్టాట్ కాపీలు తీసుకునే హక్కు, ఆ రికార్డు గానీ కంప్యూటర్‌లో ఉన్నట్టయితే దానిని ఫ్లాపీలో కాపీ చేసుకునే హక్కు, వేరే రూపంలో పొందుపరిచి ఉన్నా దానిని ఉచిత రూపంలో కాపీ చేసుకునే హక్కు, వస్తు రూపంలో ఉంటే శాంపిల్స్ తీసుకునే హక్కు అని అర్థం అని సెక్షన్ 2(జె) అంటుంది. అంతేకాదు, ప్రభుత్వ పనులను (కాలవల తవ్వకం, బిల్డింగుల నిర్మాణం వగైరాలను) పరిశీలించే హక్కు కూడ దీనిలో భాగమేనంటుంది.

మన ఈ హక్కు వ్యక్తిగత సమాచారానికే పరిమితం కాదు. ప్రభుత్వం వద్ద ఉన్న ఏ సమాచారాన్నయినా మనం పొందవచ్చు. ఫలానా సమాచారాన్ని ఎందుకోసం కోరుతున్నామన్న కారణం కూడా మనం చెప్పనవసరంలేదని సెక్షన్ 6(2) అంటుంది. మన గురించి వివరాలు కూడ ఇవ్వనవసరం లేదు. కేవలం మనకు సమాచారం పంపించవలసిన చిరునామా తెలియజేస్తే చాలు.

సమాచారం కోసం మనం ఎవరిని అడగాలి? ఏవిధంగా అడగాలి?

ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలోనూ దీని కోసం ఇద్దరు అధికారులు ఉంటారు. ఒకరు ప్రజా సమాచార అధికారి. రెండోవారు ఉప ప్రజా సమాచార అధికారి. సెక్షన్ 5(1) ప్రకారం 2005 అక్టోబర్ 1 నాటికే వీరి నియామకం జరిగిపోయి ఉండాలి. కాబట్టి ఈపాటికే మీ గ్రామ పంచాయతీ కార్యాలయంలో, మండల రెవెన్యూ ఆఫీసులో, మీ ఊరి ప్రభుత్వ ఆస్పత్రిలో, మీ జిల్లా కలెక్టర్ ఆఫీసులో, మండలం నుండి జిల్లా స్థాయి దాకా, అక్కడి నుండి రాష్ట్రస్థాయి దాకా ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలోనూ ఈ ఇద్దరు అధికార్ల నియామకం జరిగి ఉండాలి. దీని అర్థం కొత్తగా దీనికోసం అధికార్లను నియమించడం అని కాదు. ఆ కార్యాలయంలో ఉద్యోగులుగా ఉన్న ఇద్దరు అధికార్లనే ఈ చట్టం అవసరాల కోసం 'సమాచార అధికార్లు'గా నియమిస్తారు. ఉదాహరణకు మండల రెవెన్యూ ఆఫీసులో ఎంఆర్‌వోగారే ప్రజా సమాచార అధికారి కావచ్చు.

మనం వారికి అర్జీ ఏవిధంగా పెట్టుకోవాలి? రాత వచ్చిన వారయితే రాసి ఇయ్యవచ్చు. దానికి 'ఫారం' ఏదీ లేదు. మనకు తోచిన పద్ధతిలో రాసి ఇయ్యవచ్చు. మనకు రాత రాకపోతే నోటితో అడగవచ్చు. అప్పుడు ఆ అధికారి దానిని కాగితం మీద రాసి మనకు చదివి వినిపించి మన వేలిముద్ర లేక సంతకం తీసుకోవాలి.

**ఆ తరువాత?**

ఆ అధికారి మనం కోరిన సమాచారాన్ని 'వీలయినంత త్వరగా' మన ముందు ఉంచాలని సెక్షన్ 7(1) అంటుంది. అది మనిషి ప్రాణానికి గానీ స్వేచ్ఛకు గానీ సంబంధించిన సమాచారమయితే రెండు రోజుల లోపల మనకు ఆ అధికారి జవాబియ్యాలి. ఇతర సమాచారమయితే ఎట్టి పరిస్థితిలోనూ 30 రోజుల లోపల ఇయ్యాలి.

దీనికి ఖర్చేమీ చెల్లించుకోనక్కర లేదా? అర్జీతోపాటు పది రూపాయల ఫీజు కట్టాలి. మనకిచ్చిన సమాచారాన్ని మనం ఫొటోస్టాట్ లేక ఫ్లాపీ రూపంలో కాపీచేసి తీసుకునేటట్టయితే దానికయ్యే ఖర్చు చెల్లించాలి. కేవలం చూసి మనకు అవసరమయిన సమాచారాన్ని మనమే నోట్ చేసుకునేటట్టయితే తొలుత కట్టే పది రూపాయలు మించి ఏమీ కట్టనక్కరలేదు.

గడువు లోపల ప్రజా సమాచార అధికారి మనకు సమాచారం ఇవ్వకపోతే?

ఆ అధికారి సమాచారం ఇవ్వడానికి నివాకరించినట్టేనని సెక్షన్ 7(2) అంటుంది. అప్పుడు మనం రాష్ట్ర ప్రజా సమాచార అధికారికి (అది కేంద్ర ప్రభుత్వ కార్యాలయమయితే కేంద్ర ప్రజా సమాచార అధికారికి) సెక్షన్ 19(1) కింద అప్పీల్ చేసుకోవచ్చు. ముప్పై రోజుల లోపల అప్పీల్ చేసుకోవాలి గానీ ముప్పై రోజుల గడువు దాటినా కూడా మనం ఆలస్యం చేయడానికి సహేతుకమైన కారణాలున్నాయని భావిస్తే ఆ అధికారి మన అప్పీల్ స్వీకరిస్తారు. అప్పీల్ విచారణలో, మనకు సమాచారం ఇవ్వకపోవడానికి సహేతుకమైన కారణం లేదని తేలితే, ప్రజా సమాచార అధికారి చేత మనకు సమాచారం ఇప్పించడమే కాక జరిగిన ఆలస్యానికి అధికారి నుండి రోజుకు 250 రూపాయల జుర్మానా వసూలు చేస్తారని సెక్షన్ 20(1) అంటుంది. (అయితే ఆ జుర్మానా పైసలు మనకు ఇవ్వరు. ప్రభుత్వానికే చెందుతుంది.)

అసలు మనం సమాచారం కోసం పెట్టుకున్న అర్జీ స్వీకరించడానికే అధికారి నిరాకరించినా అది కూడ సమాచారం ఇవ్వడానికి నిరాకరించినట్టే అవుతుందనీ, దానికి కూడ పై నియమమే వర్తిస్తుందనీ సెక్షన్ 20(1) అంటుంది.

అప్పీల్‌లో రాష్ట్ర (లేక కేంద్ర) ప్రజా సమాచార అధికారి ఇచ్చిన తీర్పు సంతృప్తినివ్వనట్టయితే రాష్ట్ర (లేక కేంద్ర) సమాచార కమిషన్‌కు రెండవ అప్పీల్ చేసుకోవచ్చునని అదే సెక్షన్ అంటుంది.

మామూలుగా వ్యాజ్యాలలో అభియోగం వేసినవారే దానిని రుజువు చేసుకోవలసి ఉంటుంది. కానీ ఈ అప్పీళ్లలో మాత్రం తన తప్పేమీ లేదని రుజువు చేసుకునే బాధ్యత ప్రజా సమాచార అధికారిపైననే ఉంటుందని కూడ అదే సెక్షన్ అంటుంది.

ఇక్కడ ఒక మాట చెప్పుకోవలసిన అవసరం ఉంది. ప్రజా సమాచార అధికారి ప్రతీ కార్యాలయంలోనూ ఉంటారు కాబట్టి మనకు ఏ కార్యాలయం నుండి సమాచారం అవసరమో అక్కడే అర్జీ పెట్టుకుంటాం. అది బాగానే ఉంది. కానీ ఆ అధికారి మన అర్జీ తీసుకోవడానికి నిరాకరించినా, గడువు లోపల జవాబు ఇవ్వకపోయినా మనం అప్పీల్ చేసుకునే రాష్ట్ర (లేక కేంద్ర) ప్రజా సమాచార అధికారి మాటేమిటి? వారు రాష్ట్రంలో ఒకరే ఉంటారు. అంటే హైదరాబాద్‌లో ఉంటారన్న మాట. అయితే అప్పీల్ వారికే తీసుకుపోయి ఇవ్వనక్కరలేదు. అప్పీల్ మన నుండి స్వీకరించి వారికి పంపించడానికి ప్రతీ జిల్లాలోని ప్రతీ సబ్ డివిజన్‌లోనూ ఒక రాష్ట్ర (లేక కేంద్ర) ఉప ప్రజా సమాచార అధికారి ఉంటారు. అంతవరకు బాగానే ఉందనుకున్నా, అప్పీల్ విచారణ హైదరాబాద్‌లోనే జరగడం మారుమూల పల్లెల్లో నివసించే వారికి కష్టం కలిగించే విషయమే.

**అయితే...**

ఈ సమాచార హక్కుకు మినహాయింపులు లేవా? పాకిస్తాన్ సరిహద్దుపైన భారత సైన్యం ఎక్కడ మోహరించి ఉందో చెప్పమంటే కూడ చెప్పేస్తారా?

చెప్పరు. ఆ మినహాయింపు విషయంలో మనకు పెద్దగా అభ్యంతరం ఉండకపోవచ్చునేమో గానీ, సెక్షన్ 8లో చాలా పెద్ద మినహాయింపుల జాబితాయే పెట్టారు. దేశ సార్వభౌమత్వానికీ, సమగ్రతకూ, దేశ 'వ్యూహాత్మక, శాస్త్రీయ, ఆర్థిక' ప్రయోజనాలకూ, ఇతర దేశాలతోటి సంబంధాలకూ మీరడిగిన సమాచారం బయటపెట్టడం వలన హాని కలిగేటట్టయితే, అటువంటి సమాచారం మీకు ఇవ్వరు. అదేవిధంగా మీరడిగిన సమాచారం ఇవ్వడం నేరాన్ని ప్రేరేపించేటట్టయితే కూడ ఆ సమాచారం ఇవ్వరు. వేరే ఒక వ్యక్తి, లేక కంపెనీకి గల మార్కెట్‌లో పోటీపడే శక్తిని బలహీనం చేసే వ్యాపార రహస్యాలను, మేధోసంపత్తికి సంబంధించిన విషయాలను తెలియజేయరు. క్యాబినెట్‌లో చర్చనీయాంశాలుగా ఉన్న విషయాలకు సంబంధించి మంత్రులు, సెక్రటరీలు ఇతర అధికారులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు తెలియజేయరు. (అయితే క్యాబినెట్‌లో నిర్ణయం జరిగిపోయిన తరువాత దాని భౌతిక ప్రాతిపదికను మాత్రం బహిర్గతం చేస్తారు). నేర పరిశోధనకు, ముద్దాయిల అరెస్టుకు, నేర విచారణకు ఆటంకం కలిగించే సమాచారం ఇవ్వరు. చట్టం అమలుకు గాని, భద్రతా చర్యలకు గాని సహకరించడానికి రహస్యంగా సమాచారం లేక సహకారం ఇచ్చిన వ్యక్తి ఆచూకీని బహిర్గతం చేయగల సమాచారాన్ని, అటువంటి వ్యక్తి ప్రాణానికీ భౌతిక భద్రతకూ ప్రమాదం కలిగించగల సమాచారాన్ని ఇవ్వరు. చట్టసభల 'ప్రివిలేజస్'కు భంగం కలిగించగల సమాచారం ఇవ్వరు.

ఇన్ని చెప్పి చివరికి ఏమన్నారంటే 'పార్లమెంటుకూ శాసనసభలకూ నిరాకరించలేని సమాచారమేదీ ప్రజలకు నిరాకరించడానికి వీలులేదు' అన్నారు. ఇది వినడానికి బాగానే ఉంది కానీ చట్ట సభలకు నిరాకరించగల సమాచారమేమిటన్నది ఎక్కడా క్రోడీకరించలేదు. ఇచ్చేదీ ఇవ్వనిదీ ప్రతిపక్షాల కొట్లాడే శక్తినిబట్టి ఉంటున్నది.

మొత్తంమీద సమాచార హక్కు నిరాకరణ చాలా అస్పష్టంగా ఉంది. చట్టంలో అస్పష్టంగా ఉన్న విషయాలు కోర్టు వ్యాజ్యాలకు నెలవవుతాయి. మొండిగా ఉన్న స్థానిక అధికారులు సమాచారాన్ని నిరాకరించడం, అప్పీల్‌లో రాష్ట్ర (లేక కేంద్ర) ప్రజా సమాచార కమిషనర్‌లు దాని గురించి ఏదో ఒకటి అనడం, ఆ తరువాత చట్టం పరిధి ఏమిటన్న వ్యాజ్యాలు హైకోర్టుకూ, సుప్రీంకోర్టుకూ చేరుకోవడం రేపు మనం చూడబోయే చరిత్ర.

**అయినప్పటికీ...**

చేతులెత్తేసి ఈ చట్టం లాయర్లకు తప్ప వేరెవ్వరికీ పనికిరాదని వదిలేయకుండ కొట్లాడి అమలు చేయించుకోవడం మంచిది. అన్ని అర్జీలనూ అధికారులు తిరస్కరించలేరు. ఎన్నిటిని తిరస్కరిస్తారనేది ప్రజలు పెట్టే ఒత్తిడిని బట్టి ఉంటుంది. నిజానికి ఈ చట్టం పుట్టిందే అటువంటి ఒత్తిడి నుండి. కరువు పీడిత రాజస్థాన్ రాష్ట్రంలో ప్రభుత్వ కరువు నివారణ కార్యక్రమాల గురించి, వాటి అమలు గురించి ప్రజలకేమీ తెలియడం లేదనీ, ఆ సమాచారం ఒక హక్కుగా తెలియజేయాలనీ రైతు సంఘాలు చేసిన ఆందోళనలో సమాచార హక్కు అనే భావన పుట్టి ఇప్పుడు ఈ చట్టం రూపం తీసుకుంది. దీనిలోని లోపాలను కూడ దీని సక్రమమైన అమలు కోసం పోరాడే క్రమంలోనే మనం తొలగించగలుగుతాం.

14 జనవరి 2006

**మానవహక్కుల వేదిక**

Human Rights Forum (HRF)